సాక్షి
వికారాబాద్
మంగళవారం : 20 : జూన్ : 2023



పత్తి వైపే రైతన్న మొగ్గు
జిల్లా రైతులు ఈసారి సైతం పత్తి వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వానాకాలంలో పంటసాగు భారీగా పెరగనుంది. 8లో▸



శరవేగంగా గ్రామాల అభివృద్ధి
నూతన పంచాయతీ రాజ్ చట్టం ద్వారా గ్రామాల రూపురేఖలు మారాయని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. 8లో▸



కరుణించవా.. వరుణదేవా..
నైరుతి రుతుపవనాలు వచ్చాయని సంబరపడిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. వాన జాడ లేక పంటలు వాడుతున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం
వికారాబాద్ అర్బన్: వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ కె.రామాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ఫిలాసఫీ, సోషియాలజీ, సైకాలజీ, ఇంగ్లిష్, తెలుగు, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్స్ ఫెఫార్మింగ్ ఆర్ట్స్, ఉరూ మీడియంలో ఫిలాసఫీ, సోషియాలజీ, సైన్స్ పడగాజీ, మ్యాథమెటిక్స్– పడగాజీ, సోషల్ సైన్స్– పడగాజీ సబ్జెక్టులు బోధించాలన్నారు. ఒక్కో సబ్జెక్టులో ఒక పోస్టు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఎంఈడీ చేసి ఉండాలన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు అర్హత సర్టిఫికెట్ల జిరాక్స్ సెట్‌ను ఈ నెల 30లోగా డైట్ కళాశాలలో అందజేయాలన్నారు.

ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ
వికారాబాద్ అర్బన్: యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ పురుషులకు సీసీ టీవీ కెమెరా, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టర్ రిపేరింగ్ కోర్సులలో ఈనెల 20 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 ఏళ్లలోపున్న వారు అర్హులని పేర్కొన్నారు. 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలన్నారు. ట్రైనింగ్ సమయంలో ఉచిత వసతి, భోజనం అందిస్తామని తెలిపారు. వివరాలకు 9391487797, 9177141712, 6301890681లో సంప్రదించాలని సూచించారు.

‘ప్రజావాణి’కి 132 దరఖాస్తులు


అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ అశోక్ కుమార్

వికారాబాద్ అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజల నుంచి వచ్చిన 132 దరఖాస్తులు, ఫిర్యాదులను స్వీకరించారు. వీటిని ఆయా శాఖలకు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరగా వీటిని క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మైనార్టీ గురుకుల కాలేజీలో అడ్మిషన్లకు అవకాశం
వికారాబాద్ అర్బన్: మైనార్టీ గురుకుల కాలేజీ లో 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు కొనసాగుతున్నాయని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ కళాశాలలో చదివిన తమ విద్యార్థి కె.వేణు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 320వ ర్యాంక్ సాధించాడని తెలిపారు. ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో బాలికల గురుకుల కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థులు ఎస్.సంతోష, ఎండీ ఫర్హాన్ ఎంబీబీఎస్ సీటు సాధించారని పేర్కొన్నారు. వీరి విజయం వెనక అధ్యాపకుల కృషి ఎంతో ఉందని తెలిపారు. మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను తమ కాలేజీలో చేర్పించాలని సూచించారు. వివరాలకు 9959746436, 9440880510లో సంప్రదించాలన్నారు.

దాయాదుల దాడిలో వ్యక్తి మృతి


నాగరాజు (ఫైల్)

కొడంగల్ రూరల్: దాయాదుల దాడిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన రుద్రారంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేవిగారి నాగరాజు(35) పొలంలో వేప చెట్టును కొట్టి తీసుకొస్తున్నాడు. గొడవల్లో ఉన్న పొలంలో చెట్టును ఎందుకు కొట్టావంటూ.. అతని దాయాదులు నాగరాజుపై దాడి చేయగా తల, శరీరంపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజు భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. మృతుడికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా ఇరు కుటుంబాల మధ్య చాలా రోజులుగా భూ తగాదాలు కొనసాగుతున్నాయని తెలిసింది.



మొక్కలు నాటుతున్న ఎస్పీ, పోలీసులు

హరిత సంబురం
భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని, మొక్కల పెంపకం ద్వారానే ఇది సాధ్యమని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ అన్నారు. దశాబ్ది హరితోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్, ఎస్పీ కార్యాలయం, పోలీసు శిక్షణ కేంద్రంలో మొక్కలు నాటారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరిత హారంతో రాష్ట్రంలో ఏటా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐలు ఎస్‌ఐలు, నాయకులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– అనంతగిరి



అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి

ఆహార భద్రత కరువు!

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూపు
- ఏళ్లు గడుస్తున్నా కదలని ఫైళ్లు
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న పేదలు



వికారాబాద్: జిల్లాలోని అనేక మంది అర్హులకు ఆహార భద్రత కరువైంది. తెలంగాణ సర్కారు కొలువుదీరిన తర్వాత ఒకేసారి కొత్త కార్డులు జారీచేసింది. ఈ సమయంలో కూడా దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు సగం మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంది. దీంతో మిగిలిన వారంతా రేషన్‌తో పాటు అనేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. ఇదిలా ఉండగా కార్డుల్లో కొత్త పేర్లను చేర్చే విషయంపై ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంబిస్తోంది. ఆహార భద్రత పథకంలో భాగంగా ఏడేళ్ల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేసి సుమారు ఆరు వేలకు పైగా కొత్త కార్డులు జారీ చేశారు. కానీ గడిచిన ఏడేళ్లలో ఆయా కుటుంబాల్లో పెళ్లిళ్లు, ప్రసవాలు జరిగి సభ్యుల సంఖ్య పెరిగింది. మృతి చెందిన వారి పేర్లను కార్డుల్లోంచి తొలగిస్తున్న అధికారులు.. కొత్తగా వచ్చిన వారి వివరాలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పేరుకుపోయాయి.

35,000 పెండింగ్

ఏడేళ్ల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేసిన ప్రభుత్వం అర్హుల జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టింది. కానీ వీరికి కార్డులు జారీ చేయకుండా ఏడాదికి సరిపడే కూపన్లు అందజేసింది. ఆతర్వాత బయోమెట్రిక్ విధానంలో బియ్యం సరఫరా చేస్తోంది. కానీ కొత్తగా ఆయా కుటుంబాల్లోకి వచ్చిన వారిని చేర్పడంపై మాత్రం నిర్ణయం తీసుకోవడం లేదు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా 35,000 మంది ఉన్నారు. వీరందరూ ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసుకోని వారు సైతం వేల సంఖ్యలో ఉన్నారు. వీటన్నింటికీ మోక్షం కలిగితే జిల్లాకు మరో 210 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెరగనుంది. ఇలా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రేషన్‌పై రాష్ట్ర సర్కారు చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా అనేక మంది పేదలు నష్టపోతున్నారు.

2,41,622 కార్డులు

జిల్లాలోని 20 మండలాల్లో 588 చౌకధరల దుకాణాలు, 2,41,622 ఆహార భద్రతా కార్డులు ఉన్నాయి. వీటిలో 2,14,853 ఎఫ్‌ఎస్‌సీ, 26,730 అంత్యోద య, 39 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా 4,673 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. గతంలో లబ్ధిదారులందరికీ సబ్సిడీపై చక్కర పంపిణీ చేయగా ప్రస్తుతం అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు మాత్రమే ఇస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

“ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చేందుకు మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాం. వీటిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేశాం. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.

– రాజేశ్వర్, డీఎస్‌ఓ

సర్కారు బడి.. మరింత ‘బలోపేతం’

- ‘దశాబ్ది’ని పురస్కరించుకుని విద్యార్థులకు రాగి జావ
- ఉచితంగా నోటు పుస్తకాలు
- హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు

వికారాబాద్ అర్బన్: సర్కారు పాఠశాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో అడుగు ముందుకు పడింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నుంచి స్కూళ్లలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనిద్వారా పౌష్టికాహార లోపాన్ని నివారించాలని భావిస్తోంది.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిలో 99శాతం మంది పేద విద్యార్థులే ఉంటారు.వీరిలో కొంతమంది కాలి నడకన నిత్యం మక్క గ్రామంలోని స్కూల్‌కు వెళ్తారు.ఇలాంటి వారిలో చాలా మంది ఉదయం భోజనం చేయడం లేదు. సకాలంలో ఆహారం తీసుకోకపోవడం,తినే అన్నంలో పోషకాలు లేకపోవడంతో వయసుకు తగిన ఎదుగుదల వీరిలో కనిపించడం లేదు.ముఖ్యంగా బాలికలు నీరసించి తరగతి గదులు,ఆవరణలో పడిపోయిన సందర్భాలు అనేకం.ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం నిత్యం ఉదయం పూట విరామ సమయంలో వీరికి బెల్లంతో కూడిన రాగిజావ అందించాలని నిర్ణయించింది.ఇందుకు అవస రమైన రాగి పిండి,బెల్లం పొడిని స్కూళ్లకు సరఫరా చేసింది.

నేడు విద్యా దినోత్సవం

తెలంగాణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవం నిర్వహించనున్నారు. జిల్లాలోని 1,053 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 92 వేల మంది చదువుతున్నారు. వీరిలో మొదటి రోజు సుమారు 5వేల మందికి రాగిజావ అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే మన ఊరు– మన బడి కింద చేపట్టిన పనులు పూర్తయిన స్కూళ్లలో తరగతి గదులు, డిజిటల్ క్లాసులు, లైబ్రరీలను ప్రారంభించనున్నారు.



పాఠశాలలకు సరఫరా చేసిన బెల్లంపొడి, రాగిజావ ప్యాకెట్లు

3 వేల మంది చొప్పున..

గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులకు గతంలో పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్‌లను ప్రభుత్వమే పంపిణీ చేసేది. దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సుమారు ఆరు వేల మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు సైతం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఒక్కో మండలానికి మూడు వేల మందికి చొప్పున నోట్ బుక్స్ పంపించారు.

823 ట్యాబ్‌లు

జిల్లాలో 764 ప్రాథమిక పాఠశాలలు, 116 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా ఇప్పటికే 823 ట్యాబ్‌లు వచ్చాయి. దశాబ్ది వేడుకల సందర్భంగా హెచ్‌ఎంలకు వీటిని అందజేయనున్నారు.

“ అన్ని స్కూళ్లలో ఇస్తాం..

మొదటి విడతలో భాగంగా 5వేల మంది విద్యార్థులకు నెల రోజులకు సరిపడే రాగి పిండి, బెల్లం పొడి వచ్చింది. దశలవారీగా అన్ని స్కూళ్లకు ఇది అమలవుతుంది.

– డీఈఓ, రేణుకాదేవి

కందుకూరు వరకు మెట్రో



సీఎం కేసీఆర్‌కు మొక్కను బహూకరిస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తాం
- ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు
- తుమ్మలూరు ఫారెస్ట్‌లో హరితహారం ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ నుంచి తుక్కుగూడ మీదుగా కందుకూరు వరకు మెట్రో రైలును విస్తరించనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా వైద్య కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం తుమ్మలూరులో జరిగిన హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటిన అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలోని రెండు పురపాలికలు, రెండు నగర పాలికలకు రూ.150 కోట్లు, 66 గ్రామ పంచాయతీలకు రూ.9.90 కోట్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తుమ్మలూరులో సబ్‌స్టేషన్ సహా దశాబ్ది కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున.. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున మంజూరు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు.



కేసీఆర్ ప్రసంగానికి ఉత్సాహం

దేశానికే ఆదర్శం: ఇంద్రకరణ్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి

హరితహారం కార్యక్రమం ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక. తెలంగాణ పచ్చదనంతో విరాజిల్లుతోంది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఐఎఫ్‌ఎస్ ఆఫీసర్లు ఫీల్డ్ విజిట్‌కు వచ్చిపోతున్నారు. పదేళ్లలో 33 శాతం గ్రీనరీ వస్తుంది. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, అటవీ శాఖల ద్వారా ఇప్పటికే పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాం. ఈ ఏడాది కూడా భారీగా మొక్కలు నాటాలని నిర్ణయించాం.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం: సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి

సమైక్య రాష్ట్రంలో అనేక విధాలుగా నష్టపోయాం. ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ హయాంలో రంగారెడ్డి జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇప్పటికే జిల్లాకు అనేక పరిశ్రమలను తీసుకొచ్చారు.ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లతో జిల్లా రూపురేఖలే మార్చేశారు. అభివృద్ధిలోనే కాదు ఆదాయ, వ్యయాల్లోనూ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. సీఎం కేసీఆర్ విజన్,మంత్రి కేటీఆర్ పర్యవేక్షణతోనే ఇదంతా సాధ్యమైంది.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత: శాంతికుమారి, సీఎస్

అడవుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం కంకణం కట్టుకుంది. హరితహారం కార్యక్రమాన్ని గత తొమ్మిదేళ్లుగా ఓ యజ్ఞంలా చేస్తోంది. అడవుల శాతాన్ని 22 నుంచి 33 శాతానికి పెంచాలని కంకణం కట్టుకుంది. ఆ మేరకు ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట భారీగా మొక్కలు నాటింది. ఈ తొమ్మిదేళ్లలో పచ్చదనాన్ని భారీగా పెంచింది. మొక్కలు నాటి వాటిని సంరక్షించడంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. నాటిన మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

భారీగా ట్రాఫిక్ జాం..ప్రయాణికులకు ఇక్కట్లు

సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. పార్టీ అభిమానులు, ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధుల రాకతో ఇటు తుక్కుగూడ నుంచి అటు కడ్తాల్ వరకు శ్రీశైలం జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బి.దయానంద్, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, కాలె యాదయ్య, అంజయ్య యాదవ్, ప్రకాష్ గౌడ్, సుధీర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్, కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా.. సీఎం సభకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.

‘పట్నం’ దూరం!

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సీఎం టూర్‌కు దూరంగా ఉన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో నిర్వహించిన హరితహారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. సాధారణంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పాల్గొనే సభల్లో ఆయన అందరికన్నా ముందుంటారు. ఎంతటి బిజీ షెడ్యూల్ ఉన్నా.. పనులన్నీ వాయిదా వేసుకుని వస్తారు. కానీ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం కూడా ఉంది. వికారాబాద్ జిల్లాతో పాటు చేవెళ్ల నియోజకవర్గంపై మహేందర్‌రెడ్డికి మంచి పట్టుంది. గత శాసన మండలి ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో జిల్లా నుంచి పోటీ చేసి గెలుపొందారు. మొదట్లో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయన ఇటీవల కొంత దూరంగా ఉంటున్నారు. తాజాగా సీఎం పర్యటన నేపథ్యంలో గైర్హాజరవడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

యాత్ర తిరిగొద్దామా..!



సమావేశంలో చర్చిస్తున్న ఏఎంసీ పాలక వర్గం

- ఏఎంసీ మొదటి సమావేశంలో సభ్యుల చర్చ
- నిధులు లేవన్న మార్కెట్ కార్యదర్శి
- రైతుల సమస్యలపై మాట్లాడని పాలక వర్గం

బషీరాబాద్: బషీరాబాద్ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం మొదటి సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతి బాయి అధ్యక్షతన సోమవారం జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో రైతులు, వానాకాలం సాగుపై చర్చించకుండా.. ‘ఎక్కడైనా మంచి టూర్ వేయండి.. అలా సరదాగా తిరిగొద్దాం..’ అంటూ సెక్రటరీ లక్ష్మయ్యకి సూచించారు. అయితే సభ్యుల సూచనలను ఆయన నిరాకరించారు. యాత్రలు వెళ్లడానికి ఇది సమయం కాదని, అందుకు నిధులు కూడా లేవని తేల్చి చెప్పారు. కనీసం మంచి ఫర్నిచర్ అయినా కొనండి అంటూ సెక్రటరీకి చెప్పడం గమనార్హం. ఓ వైపు వానాకాలం సాగు ప్రారంభమై రైతులు ఎరువులు, విత్తనాల కోసం ఎదురు చూస్తుంటే పాలకవర్గం మాత్రం ఇలా యాత్రలు, ఫర్నిచర్ అంటూ అనవసర చర్చ చేయడం విమర్శలకు తావిచ్చింది. మొత్తానికి మొదటి సమావేశాన్ని సరదాగా ముచ్చట్లు పెట్టి మమ అనిపించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, డైరెక్టర్లు శివరామ్, పి.జగన్నాథ్‌రావు, చంద్రశేఖర్, పొతురాజు రాములు, మ్యాతరి లక్ష్మయ్య, మహమ్మాద్ ఫకీర్ అహ్మాద్, పాండురంగా, బి.వెంకట్‌రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

బషీరాబాద్: మండలంలోని మైల్వార్, ఎక్మాయి, కొత్లాపూర్, అల్లాపూర్, బషీరాబాద్ పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వెంకటస్వామి సోమవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. అనంతరం ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. మార్పులు చేర్పులకు కూడా అవకాశం ఉందన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

కొడంగల్ రూరల్: వారం రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి సోమవారం శవంగా కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని చిట్లపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిట్లపల్లికి చెందిన సురేష్(55) వారం రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని వాగు సమీపంలో సురేష్ మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో గల ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను, ఎన్నికలకు ఉపయోగించే సామగ్రిని సోమవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

చేవెళ్ల: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన చేవెళ్లలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చేవెళ్లలోని దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న బావిలో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి మృతి చెందాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికితీశారు. మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పత్తి వైపే రైతన్న మొగ్గు

- గత ఏడాదికి మించి సాగయ్యే అవకాశం
- మేలైన నేలలు, రకాలు ఎంచుకోవాలి: వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్

నవాబుపేట: జిల్లా రైతులు ఈ సారి సైతం పత్తి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వానాకాలంలో పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. గత ఏడాది అధిక వర్షాలతో దిగుబడి తగ్గి, ధరలు పెరిగాయని పేర్కొన్నారు. పెరిగిన ధరలను చూసి ఎక్కువ మంది రైతులు పత్తి సాగు వైపే ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 2లక్షల 40 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, ఈ సారి అదనంగా 20 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని చెప్పారు. జూలై మాసం చివరి వరకు పత్తి పంటను సాగు చేసుకోవచ్చని తెలిపారు. పత్తి రైతులు సాగులో మెళకువలు పాటించాలని ఆయన సూచించారు.

అనువైన నేలలు ఇవే..

పత్తి సాగుకు నల్ల రేగడి నేలలు అనుకూలం. నీటి సదుపాయం కలిగిన సారవంతమైన ఎర్ర నేలల్లో కూడా సాగు చేయవచ్చు. తొలకరి వర్షాలు పడిన తర్వాత పొలాన్ని రెండు మూడు సార్లు దున్నుకోవాలి. విత్తనాలు ఏ పద్ధతిలో వేసుకోవాలన్నది విత్తన రకం, నేల స్వభావంపై ఆధారపడి ఉంటుంది. అవకాశం ఉన్న వారు ఆఖరి దుక్కిలో ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువు వేయాలి. చివరి దుక్కిలో 150 కిలోల సింగల్ సూపర్ పాస్ఫేట్ వేసి కలియదున్నాలి. భూమి బాగా తడిసిన తర్వాత విత్తనాలు వేసుకోవాలి. నల్లరేగడి నేలల్లో 60 నుంచి 70 శాతం తేమ ఉంటేనే ఎర్ర నేలల్లో 50 నుంచి 60 శాతం తేమ ఉంటే విత్తనం వేసుకోవచ్చు.

రకాల ఎంపిక

పత్తిలో చాలా రకాల విత్తనాలు ఉన్నాయి. బీటీ పత్తినే ఎక్కువగా సాగు చేస్తున్నారు. నూజివీడు, సదానంద్, మైకో, రణవీర్, జయహో, అంకూర్, బయోసీడ్‌యువ, రాశీ ఇలా చాలా కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

ఎరువుల వాడకం

ఎకరాకు 60 నుంచి 80 కిలోల నత్రజని, 25 నుంచి 35 కిలోల భాస్వరం, 25 నుంచి 35 కిలోల పొటాష్ వేసుకోవాలి. భాస్వరం, పొటాష్‌లను మూడు సమభాగాలుగా చేసుకొని విత్తిన 30 రోజులకు , 60 రోజులకు, 90 రోజులకు వేసుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకుని అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి.



వట్టిమీనపల్లిలో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

విత్తే పద్ధతి

ఎకరానికి 650 గ్రాముల విత్తనాలు సరిపోతాయి. నేల సారాన్ని బట్టే విత్తే దూరం ఎంచుకోవాలి. బలమైన నల్లరేగడి నేలల్లో 90 ప్లస్ 90 సెం.మీ. మధ్యస్థ నేలల్లో వరుసల మధ్య దూరం 90 సెం.మీ. మొక్కల మధ్య దూరం 90 సెం. మీ. ఉండేట్లు విత్తుకోవాలి. బీటీ పత్తి చుట్టు రెండు నుంచి నాలు వరుసలు నాన్ బీటీ పత్తిని కచ్చితంగా విత్తుకోవాలి.

నకిలీ విత్తనాలపై ఫిర్యాదు చేయండి



అమాయక రైతులను ఆసరాగా చేసుకొని దళారులు నకిలీ విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూస్తారు. ఎవరైనా గ్రామాల్లోకి వచ్చి నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, వికారాబాద్

నాటిన ప్రతి మొక్కనూ రక్షిద్దాం: ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ రక్షించుకుందామని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్‌తో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతగిరి అడవిలో ఎన్నో ఔషధ మొక్కలు ఉన్నాయని, వాటి వల్ల మనకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే భవనాలు నిర్మించుకోవడం కాదని, స్వచ్ఛమైన వాతావర్ణాన్ని ఏర్పాటు చేసుకోవడం అన్నారు. అనంతరం అటవీ శాఖ నర్సరీల నిర్వహణలో మెరుగైన సేవలు అందిస్తున్న వన సేవకులు రాములు, చంద్రకాంత్, ప్రభాకర, శంకరయ్య, మొగులయ్య, వెంకటయ్యలను సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ధారూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం తెలంగాణకు మణిహారం

- పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం అగ్రస్థానం
- ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



నాగులపల్లి రిజర్వ్ ఫారెస్టులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు

పెద్దేముల్: హరితహారం తెలంగాణకు మణిహారమని, పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగుపలల్లి రిజర్వు ఫారెస్టులో దశాబ్ది హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం అనేది ప్రపంచంలోనే ఓ మహోత్తర కార్యక్రమం అన్నారు. 50 వేల ఎకరాల్లో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించడమే హరిత హారం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐ రాంబాబు, తాండూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు, ఎంపీపీ అనురాధ, గ్రామ సర్పంచ్ మట్ట భాగ్యలక్ష్మీ, ఎంపీటీసీ సురేఖ, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ చారి, సర్పంచ్‌లు పాండునాయక్, జైరాంనాయక్, శంకర్ పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు చేయూత

తాండూరు టౌన్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేయూత నందించి అండగా నిలవాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆర్టీసీ బస్ పాస్ సర్వీసు చార్జీలను చెల్లించేందుకు ముందుకు వచ్చారు. దీనిలో భాగంగా సోమవారం తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సమతకు రూ. 5లక్షల చెక్కును అందజేశారు.

శరవేగంగా గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: రాష్ట్రంలో అమలవుతున్న నూతన పంచాయతీ రాజ్ చట్టం ద్వారా గ్రామాల రూపురేఖలు మారాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సోమన్‌గుర్తి, కెరవెల్లి , సిరిగాయపల్లి, దేవనోనిగుడ, రాకంచర్ల, మేడికొండ, చీలాపూర్, పూడూరు గ్రామాల్లో పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ చేయడంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణం, నర్సరీ, డంపింగ్ యార్డు వంటి వాటి ఏర్పాటు చేయడంతోపాటు ట్రాక్టర్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



పూడూరు: సోమన్‌గుర్తి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

ఆకుపచ్చ తెలంగాణే కేసీఆర్ లక్ష్యం

పరిగి: ఆకుపచ్చ తెలంగాణ ఆవిష్కరించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవ కార్యక్రమంలో భాగంగా మిట్టకోడూర్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్ రావు, జెడ్పీటీసీ హరిప్రియ, నాయకులు ప్రవీణ్ రెడ్డి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు కేసీఆర్ అండ

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- 12 మందికి గొర్రెల యూనిట్ల పంపిణీ



లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: గొల్లకురుమల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బొంరాస్‌పేట మండలం ఎనికెపల్లికి చెందిన 12 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సబ్సిడీపై గొర్రెలు ఇస్తున్నట్లు చెప్పారు. 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇస్తున్నట్లు తెలిపారు. యూనిట్‌ను ధరను రూ. లక్షా 75వేలకు పెంచినట్లు చెప్పారు. ఇందులో లక్షా 31వేల 250 రూపాయలు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు తమ వాటా కింద రూ.43,750 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధు యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, గొల్ల కురుమ సంఘం నాయకులు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

పట్టణంలోని మున్సిపల్ పార్క్‌లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం మొక్కలు నాటారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత్సోవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మధుసూదన్‌రావ్ యాదవ్, రమేష్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, మహిళా సమాఖ్య సభ్యులు ఆనందమ్మ, అన్నపూర్ణ, మున్సిపల్ సిబ్బంది క్రాంతి, భరత్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

దౌల్తాబాద్: హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించాలని ఎమెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో హరితోత్సవంలో భాగంగా పెద్ద చెరువు కట్టపై మొక్కలను నటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తిరుమల స్వామి, ఏపీఓ రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కరుణించవా.. వరుణదేవా..

- ఇప్పటికే విత్తు వేసిన రైతులు
- వాన జాడ లేక ఎండిపోతున్న విత్తనాలు, మొక్కలు
- వర్షాల కోసం ఎదురు చూపులు



రాంపూర్ తండాలో మొలకెత్తిన పెసర

ధారూరు: నైరుతి రుతుపవనాలు వచ్చాయని సంబరపడిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. చిన్నపాటి వర్షాలకే కొంతమంది రైతులు విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. విత్తి పది రోజులైనా వాన జాడ లేకపోవడంతో మొలకలు వాడిపోతున్నాయని రైతులు తెలిపారు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తాయని భావించిన అన్నదాతలు పత్తి, కంది, పెసర, మినుము, మొక్కజొన్న తదితర విత్తనాలు విత్తారు. అయితే వర్షాల జాడ లేకపోవడంతో వేల రూపాయలు వచ్చించి కొనుగోలు చేసి నాటిన విత్తనాలు భూమిలోనే ఎండి పోతున్నాయని పలువురు రైతులు తెలిపారు. సకాలంలో విత్తితే పంట దిగుబడి అధికంగా వస్తుందని ఆశించిన రైతన్నలకు నిరాశే ఎదురవుతోంది. ధారూరు మండలంలో ప్రస్తుత వానా కాలం సీజన్‌లో రైతులు దాదాపు 25వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేయనున్నారు. వర్షాలు బాగా పడతాయని ప్రచారం జరగడంతో తొలకరి వానలకు 10 వేల ఎకరాల్లో విత్తనాలు వేశారు. ఈ సారి పత్తి పంటపై ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రైతులు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. జూన్ మాసం పూర్తి కావస్తున్నా వర్షాల మాట అటుంచితే ఎండలు ఏమాత్రం తగ్గడం లేదు.

మొలకెత్తని విత్తనాలు



జూన్ మొదటి వారంలో వర్షాలు కురవడంతో ఏడు ఎకరాల్లో పత్తి, మరో ఏడు ఎకరాల్లో కంది విత్తనాలు వేశా. ఆ తర్వాత వర్షాలు పడలేదు. దీంతో విత్తనాలు మొలకెత్తలేదు. 13 ప్యాకెట్ల పత్తి విత్తనాలు, 35 కిలోల కంది విత్తనాలను వేశా. ఇందుకు రూ. 50 వేల వరకు ఖర్చు వచ్చింది. వర్షాలు పడకపోవడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల విత్తనాలు మొలకెత్తుతాయా లేదా అనే అనుమానం కలుగుతోంది.

– బలవంత్‌రెడ్డి, రైతు, ధర్మాపూర్, ధారూరు మండలం

సేవలే గుర్తుండిపోతాయి: ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో వీఆర్ఎస్ తీసుకున్న కానిస్టేబుల్ రాములు, సత్యనారాయణకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాలువా, జ్ఞాపికలు అందించి సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకమై పనిచేస్తేనే మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రత్నం, జిల్లా పోలీసు ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాములును సన్మానిస్తున్న ఎస్పీ

6 నెలల పసికందుకు ప్రాణం పోసిన వైద్యులు

హఫీజ్‌పేట్ : 6 నెలల పసికందుకు చందానగర్‌లోని పారమిత ఆస్పత్రి వైద్యులు 82 రోజుల పాటు ఐసీయూలో వైద్యం అందించి ప్రాణం పోశారు. సోమవారం పారమిత ఆస్పత్రి డాక్టర్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా సిద్దులూరు గ్రామానికి చెందిన లక్ష్మి గర్భిణిగా ఉన్న సమయంలో బిడ్డ నెలలు నిండే కొద్దీ బరువు పెరుగుతుండడంతో గర్భ సంచి సమస్య తలెత్తింది. అప్పటికి 6 నెలలు ఉన్న సందర్భంగా వెంటనే వైద్యులు లక్ష్మికి డెలివరీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం 670 గ్రాములు ఉన్న మగబిడ్డకు జన్మనిచ్చింది. మెరుగైన వైద్యం కోసం వెంటనే చందానగర్‌లోని పారమిత చిల్డ్రెన్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పసిబిడ్డకు ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. సుమారు 82 రోజుల పాటు 24 గంటల పాటు బాబును ఎప్పటికప్పుడు పరీక్షించి వైద్య పరీక్షలు చేస్తూ, అత్యుత్తమ యంత్ర పరికరాలతో వైద్యం అందించి కాపాడినట్లు విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. 670 గ్రాముల ఉన్న పసిబిడ్డ 3 నెలల తరువాత 1150 గ్రాముల బరువు పెరిగాడన్నారు. ప్రిమెచ్యూర్ అయిన బాబుకు 82 రోజుల పాటు వైద్యం అందించిన వైద్యులకు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటి వరకు సుమారు 15 ప్రిమెచ్యూర్ డెలివరీలు చేశామన్నారు. సమావేశంలో వైద్యులు సాయి ప్రణీత్ రెడ్డి, టి.రాజశేఖర్‌రెడ్డి, జగన్ మోహన్ సి.రుకేష్ చారి పాల్గొన్నారు.



పసికందుతో తల్లి, ఆస్పత్రి వైద్య బృందం

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పెద్దేముల్: ఆటో కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి కథనం మేరకు.. గాజీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(35) మండలంలోని కందనెల్లి తండాకు చెందిన అమ్మాయిని పదేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నాడు. పది రోజుల క్రితం శ్రీనివాస్ భార్య తల్లి ఇంటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకున్న శ్రీనివాస్ ఆటోలో తాండూరు వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రికి ఇంటికి రాలేదు. ఉదయం కందనెల్లి తండా శివారులోని అంతిరెడ్డి కుంటలో ఆటో ఉండడం ఆటో క్రింద శ్రీని వాస్ మృతదేహం లభ్యమైంది. సోమవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మృతదేహాన్ని చూసి సర్పంచ్ మోహన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన విషయాన్ని పోలీసులకు చేరవేశారు. వారు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. అయితే శ్రీనివాస్ మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి లక్ష్మి, బాబాయి శంకరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆటో కింద శ్రీనివాస్ మృతదేహం

అర్హులందరికీ డబుల్ ఇళ్లు ఇవ్వాలి



దోమ: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

పరిగి: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటి స్థలం లేని నిరుపేదలకు 125 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు మంజూరు చేయాలన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని వాటిని స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, శేఖర్, సునిత తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించాలి

దోమ: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం దోమ తహసీల్దార్ షాహెదబేగంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలు చాలా ఉన్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికీ 125 గజాల స్థలంతో పాటు ఇళ్లు నిర్మించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రూ. 15 లక్షలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు సత్తయ్య, నేతలు రఘురాం, శేఖర్, రాములు, బాబు, అనిల్, బిచ్చయ్య, నవీన్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

One year 10th,inter, NIOS,TOSS, APOSS, Degree&PG, Year Wise Nagarjuna, SV University guidelines for B. Tech, Detained,Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462 [H-788709]

REAL ESTATE

LAND FOR SALE

For Sale 163 Acres Single-bit Prime Land, Clear Title, Road-Facing, Close to Vijayawada - Nagpur Express way, Excellent Environment for Living, Business and Agriculture, High Iron Soil. Nawabpet (V), Chityala (M), Bhupalpally (D), Contact: 7675868777, 7207314277, info@amodagroup.com [HA-26811]

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793448]

హైదరాబాద్ లో బేబీకేర్, పేషెంట్ కేర్, ఇంటిపని, వంటపని సెక్యూరిటీ పని చేయుటకు అర్జెంటుగా కావలెను. జీతం: 15-25 వేలు, రూం+మీల్స్ ఫ్రీ, 12గం. & 24/7గం. ఫోన్ : 9701155505. [HA-30868]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.